ప్రజాశక్తి

బుధవారం 17 మే 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

నిప్పుల కొలిమిలా మాచర్ల

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో ఈ ప్రాంతమంతా నిప్పుల కుంపటిలా మారింది. ఎండ వేడితాడలేక ప్రజలు విలవిలాడుతున్నారు. గత వారం రోజులుగా 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం 48 డిగ్రీలు, మంగళవారం 47 డిగ్రీలు నమోదు కావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత నేపథ్యంలో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే జంకుతున్నారు. దీంతో ఉదయం 11 గంటల నుండే రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరంగా బయటకు రావాల్సిన వారు ముసుగులు ధరించి వస్తున్నారు. ఎక్కడైనా చెట్ల వద్ద కాస్తంత నీడ దొరికితే అక్కడే కొంతసేపు సేద తీరుతున్నారు. మున్సిపాల్టీ వారు ప్రధాన వ్యాపార కూడళ్ల సముదాయాల వద్ద నిలబడేందుకు కొంత నీడ సదుపాయం, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చలివేంద్రాలకు సమీపంలో ఒక టెంట్ వేసి సేద తీరేందుకు అవకాశాలు కల్పించాలంటున్నారు. ఎండల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో తగిన జాగ్రత్తలు ప్రచారం చేయించాలని, వృద్ధులు, పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా వారి కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని మాచర్ల ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పొలంలోనే మాడుతున్న ఆకుకూరలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

చక్కని ఆరోగ్యానికి, ఆకుకూరలు ఎంతో మేలని అందరికీ తెలిసిందే. అయితే వాటిని పండించే రైతుల బాధలు అంతా ఇంతా కావు. ఏ పంటలకు ఉండనంత కౌలు ఆకుకూరలు సేద్యానికి ఉంటుంది. అన్ని కాలాలు అనుకూలిస్తే, ఆకుకూర రైతులకు లాభాలే.. లేదంటే అప్పుల ఊబిలో కూరుకు పోవాల్సిందే. వేసవి భానుడి ప్రతాపం రోజు రోజుకి నిప్పుల కొలిమిలా మారుతోంది.

మూడ్రోజులుగా ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలతో ప్రతాపం చూపిస్తుంటే మరోవైపు పచ్చని పైర్లన్నీ సూర్య తాపానికి మాడిపోతున్నాయి. తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వాణిజ్య పంటలతో పాటు, ఆకుకూరలు అధికంగా సాగవుతున్నాయి. కుంచనపల్లిలో 300 మందికి పైగా రైతులు ఆకుకూరలు పండిస్తున్నారు. వీటిని ఆకుకూరలు మార్కెట్‌కు వేసి, వచ్చిన ఆదాయంపైనే ఆయా రైతు కుటుంబాలు జీవిస్తుంటాయి. నిత్యం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్, నగరంలోని వివిధ రైతు బజార్లలో ఆకుకూరలు అమ్ముతుంటారు. సీజన్, అన్‌సీజన్‌తో సంబంధం లేకుండా ఆకుకూరలు పండించి, అమ్ముతుంటారు. వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కంద, చేమ, తదితర పంటల కంటే మూడు రెట్లు అధికంగా ఆకుకూరల పంటల కౌలుంటుంది. ఒక్కో ఎకరానికి రూ.లక్ష నుండి రూ.లక్షన్నర వరకూ కౌలు చెల్లిస్తున్నారు. వాతావరణం అనుకూలించి, సారవంతమైన నేల అయితే ఆకుకూరలు దిగుబడి బాగానే ఉంటుంది. లేదంటే అకాల వర్షాలు, వేసవికాలం ఎండవేడికి ఆకుకూరలు దెబ్బతింటాయి. దీంతో ఆకుకూర రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. ఇటీవల నిప్పుల్లా కాస్తున్న ఎండలతో ఆకుకూరలు మాడిపోతున్నాయి. రూ.లక్షల పెట్టుబడితో సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అల్లాడుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం 48 డిగ్రీలు నమోదై స్థానికులను బెంబేలెత్తించింది. రాత్రి గంటలకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు వేసవి తీవ్రతకు అద్దం పడుతోంది. సాధారణంగా రోహిణికార్తెలో నమోదు కావాల్సిన ఇంత తీవ్రమైన ఎండలు 10 రోజులు ముందుగానే కాస్తుండడంతో సాధారణ ప్రజానీకంతోపాటు పిల్లలు, వృద్ధులు నానా అవస్థ పడుతున్నారు. మూగజీవాల పరిస్థితి వర్ణనాతీతం. కొద్దిరోజులు ఇదే ఉష్ణోగ్రతలుంటాయని వాతావరణ శాఖ ప్రకటనతో జనం మరింత ఆందోళనకు గురవుతున్నారు. పశువులను, గొర్రెలను మేత కోసం బయటకు తీసుకెళ్లడానికి పోషకులు వణికిపోతుంగా వాటిని కాపలా కాసేవారి దుస్థితి మరింత దారుణంగా తయారైంది.

ఇదిలా ఉండగా కొన్ని విద్యాసంస్థలు తమ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడడంతో వారూ నానా తిప్పలు పడి కాలేజీలకు వెళ్తున్నారు. ఉదయం నుండే భాను తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ఉపాధి హామీ కూలీలు, పొలం పనులకు వెళ్లిన వారు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు మున్సిపాల్టీ, పంచాయతీల అధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వివిధ రకాల పానియాల ధరలనూ పెంచారని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ రహిత జిల్లా సాధిద్దాం

అవగాహన ర్యాలీని ప్రారంభించిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-నరసరావుపేట

డెంగీ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని పల్నాడు రోడ్డులోని పాత ఏరియా హాస్పిటల్ వద్ద కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ రహిత పల్నాడు జిల్లా 2లో

ర్యాలీలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, వైద్యాధికారి శోభారాణి తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాజకుమారి

ఆకస్మికంగా తనిఖీలు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఆకస్మికంగా తనిఖీలు చేయాలని అధికారులను ఆర్‌డిఒ బిఎల్‌ఎన్ రాజకుమారి ఆదేశించారు. ఈ మేరకు తన కార్యాలయంలో లింగనిర్ధారణ చట్టంపై ఉప జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చట్టం 1994 పరిధిని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించి ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 102, 104 నంబర్లకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డివిజన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నాగ పద్మజ, కమిటీ సభ్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రేమ, డాక్టర్ అనూష, జిల్లా డిప్యూటీ డెమో సాంబశివరావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఖాజావలి పాల్గొన్నారు.

పాడైన మొక్కజొన్న కొనడం లేదు

జెసి ఎదుట రైతుల ఆవేదన - వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మార్క్‌ఫెడ్ రైతుల వద్ద నుంచి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి సిడబ్ల్యుసి, పెదకాకాని గోడౌన్‌లో నిల్వ ఉంచిన మొక్కజొన్న, శనగలును జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం తనిఖీ చేశారు. గోదాము నిర్వహణ గురించి నాణ్యతా ప్రమాణాలపై గోడౌన్ మేనేజర్ తెలిపారు. అక్కడి హమాలీలతో జెసి మాట్లాడి వారి సమస్యలను అడిగి 2లో

రైతులతో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

లే అవుట్‌లను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

యర్రబాలెం, కృష్ణాయపాలెంలో లే అవుట్ ల పరిశీలన

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

సీఆర్డీఏ పరిధిలోని యర్రబాలెం, కృష్ణాయపాలెం లో పేదల కు కేటాయించిన లేఅవుట్లు రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి ఆది మూలపు సురేష్, ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నం దిగం సురేష్ లు పరిశీలించారు. పేదలకు సెంటు భూమి చొప్పున ప్రభు త్వం పంపిణీకి ఆదేశించిన నేపథ్యంలో వారు మం గళవారం పరి శీలించారు. వారి వెంట ఎమ్మెల్సీ లు తలశిల రఘు రామ్, లేళ్ల అప్పిరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో లే అవుట్‌ల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం ఐనవోలులో పేదలకు సెంటు స్థలం పంపిణీకి సంబంధించిన లే అవుట్ లను ఆర్డీవో ప్రభాకరరెడ్డి మంగళవారం పరిశీలించారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంకు వచ్చిన ఆర్డీవో అధికారులతో మాట్లా డుతూ,లే అవుట్ లలో అభివద్ధి పనులను వేగవంతం చేయా లని చెప్పారు.అనంతరం ఐనవోలు లోని లే అవుట్ లలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్,ప్లాట్ల చదును తదితర పను లను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో నిర్దేశించిన గడువు లోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు పుట్టినరోజు వేడుకలను చేబ్రోలులో ఘనంగా నిర్వహించడం జరిగింది. చేబ్రోలు శాఖ గ్రంథాలయంలో గ్రం థాలయ అధికారి శకుంతల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గ్రంథాలయ సిబ్బంది , చేబ్రోలు గ్రామ ప్రజలు శేష గిరిరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ గ్రం థాలయాల్లో విద్యార్థులు నిరుద్యోగులు పేర్లు నమోదు చేసు కోవడం ద్వారా తమకు కావలసిన పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లి చదివి తిరిగి ఇవ్వవచ్చని తెలియజేశారు. చేబ్రోలు గ్రంథాలయ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పులి ప్రభుదాసు గారు , కారుమూరి యశోద ఆనందరావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కారుమూరి రాజేంద్ర,శాఖా గ్రంథాలయ సిబ్బంది, పాల్గొన్నారు

విటెరో టైల్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రముఖ బిల్డింగ్ మెటీరియల్స్ సంస్థ అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విటెరో టైల్స్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైల్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న తమ సంస్థ రానున్న కాలంలో మరిన్ని టైల్స్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా నూతన ప్రాంతాలలో పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టైల్ సైజులను అధీకృత డీలర్ల ద్వారా మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగ తిన పూర్తి చేయాలని అధికారులను సత్తెన పల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమీ ఆదేశిం చారు. సత్తెనపల్లి మండలం గండ్లూరులో జగన్నన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. సత్తెనపల్లి పట్టణంలోని 1055 మందికి గండ్లురులో జగనన్న కాలనీలో ప్లాట్లు కేటాయించగా వాటిని కమిషనర్ పరిశీలించారు. ఇప్పటివరకు 640 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని, మిగతా 415 నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా, ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు.

ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కె షమీ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదార్లను తహశీల్దార్ క్షమా రాణి కోరారు. మండలంలోని ఖమ్మం పాడు, జలాల్పురం, పెదకూరపాడులో గృహ నిర్మాణాలను తహశీల్దార్ పరిశీలిం చారు. నిర్మాణ్మాలు పూర్తి చేసిన వెంటనే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. పరిశీలనలో ఎంపిడిఒ నరసింహారావు, హౌసింగ్ ఎఇ బాష, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి : టిడిపి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణ వాసులకు సు రక్షిత నీటిని (మినిరల్ వాటర్) అం దించాలన్న సంకల్పంతో ఎన్టీఆర్ సు జల ప్లాంట్ ను పట్టణానికి 2018లో మంజూరు చేయడం జరిగిందని ప్రత్తిపాటి పుల్లారావు మంగళ వారం అన్నారు. ఎంపీ గ్రాంట్స్, సీఎస్.ఆర్ ఫండ్స్ నుండి రూ.2.93 కోట్లు ప్లాంట్ నిర్మాణానికి మంజూరు చేయించి, పట్టణంలోని శివారు ప్రాం తాల్లోని 17 ప్రాంతాలను ఎంపిక చేసి వాటర్ అవుట్ లెట్లను ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ వారికి, పేట మున్సిపా లిటీకి నాడు జరిగిన ఒప్పందంలో భాగంగా రోజుకు 0.5 మిలియన్ లీటర్లను ప్లాంటుకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అతి తక్కువ ధరకు మినిరల్ వాటర్ ను పేద ప్రజలకు అం దించాలన్న ఆకాంక్షతో ఎన్టీఆర్ ట్రస్ట్ వారిని ఒప్పించి ప్లాంట్ నిర్మాణం జరిపి, ప్రజలకు మినరల్ వాటర్ ను అందించే సమయంలో వైసిపి అధికారంలోకి రావడం జరిగిం దన్నారు. అనంతరం సుజల ప్లాంట్ పై ఒక కక్ష పూరిత ధోరణితో మదర్ ప్లాంట్ కు నీటి సరఫరాను మున్సిపాలిటీ అధికారుల పై ఒత్తిడి చేసి నిలిపివేయడం జరిగిందన్నారు. నీటి సరఫరా నిలిచిపోయిన నాటి నుండి ప్లాంట్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికి అధికార పక్షం నేత లు చోద్యం చూస్తున్నారసన్నారు. గత సం వత్సరం ఇదే నెలలో ప్లాంట్ పునరుద్ధరించ డానికి ప్రయత్నిస్తే నా పై అక్రమంగా స్థానిక మంత్రి, ఒక దళి త మహిళ అధికారినితో అడ్డుపెట్టు కొని అట్రాసిటీ కేసు నమోదు చేయిం చారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ప్లాంట్ కు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తారీకులోపు ప్లాంట్ నీరు అందించే విషయంలో అధికారులు ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల ని, లేకుంటే ప్రత్యక్ష ఆందోళన తప్ప దని హెచ్చరించారు. మీరు ప్లాంట్ కు నీటిని అందించే పక్షంలో ప్లాంట్ మరమ్మత్తులు తన సొంత డబ్బులతో చేయిస్తానని ప్రత్తిపాటి అన్నారు.

డెంగీ రహిత జిల్లా సాధిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సాధనకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని, అందుకు ప్రజలూ సహకరించాలని కోరారు. డెంగీ లక్షణాలు, చికిత్స పొందాల్సిన విధానం, వ్యాధికి కారణమయ్యే దోమలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గితాంజలి, ఎయిడ్స్, టిబి- లెప్రసీ అధికారి డాక్టర్ పద్మావతి, జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ పాల్గొన్నారు.

పాడైన మొక్కజొన్న కొనడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. అనంతరం అనుమర్లపూడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల నుంచి అర్జీలను తీసుకున్నారు. పాక్షికంగా పాడైన తమ మొక్కజొన్నను కొనుగోలు చేయట్లేదని రైతులు చెప్పారు. దీనిపై జెసి స్పందించి పంట నష్టంలో భాగంగా తమ మండల వ్యవసాయ అధికారి ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాల మేరకే పంట కొనుగోలు చేస్తారని సిడబ్ల్యూసి పెదకాకాని మేనేజర్ చెప్పారు. గుంటూరు జిల్లాలో 170 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటి వరకూ జిల్లాలో 85 మంది రైతుల వద్ద నుండి 727 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన నగదును త్వరలోనే రైతుల ఖాతాలలో జమ చేస్తామన్నారు.

వ్యాధులకు మూలకారణం అధిక రక్తపోటు

- ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టరు రాకేష్ బొబ్బా
- నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: హృదయ సంబంధ వ్యాధులకు ముఖ్యంగా హార్ట్‌ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్, పక్షవాతం, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, అంగస్తంభన వంటి ఇతర సమస్యలను అధిక రక్తపోటు మూలకారణమని రమేష్ హాస్పిటల్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టరు రాకేష్ బొబ్బా తెలిపారు. మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి పలు విషయాలు చెప్పారు. సరైన రోగ నిర్ధారణ, నిర్వహణకు ఖచ్చితమైన బ్లడ్ ప్రెషర్ కొలత అవసరం. సుమారు 20 నుండి 40 శాతం మందిలో రక్తపోటును సరైన పద్ధతిలో కొలవకపోవడం వల్ల వారిలో అవసరం లేకుండానే మాత్రలు వాడాల్సి వస్తుంది. నిజంగా మాత్రలు అవసరమైన వారు మాత్రలు ఉపయోగించడం లేదు. బి.పి పరీక్షించటానికి అరగంట ముందు వరకు ఎటువంటి ఆహారం, టీ, కాఫీ వంటివి తీసుకోకూడదు. వ్యాయామం చేయకూడదు. బిపి పరీక్ష చేయించుకునే ముందు రెండు మూడు నిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చోవాలి. ఆ ప్రదేశం నిశ్శబ్దంగా ఉండాలి. పరీక్ష సమయంలో ఇతరులతో మాట్లాడకూడదు. కుర్చీలో సౌకర్యవంతంగా కూర్చుని చేతిని ముందు ఉన్న టేబుల్ పై పెట్టి పాదాలు నేలకు ఆనునేలా కూర్చోవాలి. బీపీని కొలవడానికి ఉపయోగించే పరికరాన్ని సమయానుసారంగా క్యాలిబ్రేషన్ చేసుకోవాలి. అధిక రక్తపోటును ఒకే రీడింగ్‌తో కాకుండా రెండు నుండి మూడు రీడింగ్లను తీసుకొని వాటి సగటు రీడింగ్ నుబట్టి నిర్ధారించాలి. సెకండరీ హైపర్‌కు ముఖ్యమైన కారణాలు కిడ్నీ సమస్యలు, మరియు హార్మోన్ సమస్యలు. హార్మోన్ సమస్యలు ముఖ్యంగా హైపోథైరాయిడిజం, క్యూషింగ్ సిండ్రోమ్ వంటి ఎడ్రినల్ సమస్యలు సెకండరీ హైపర్‌టెన్షన్‌కు దారితీస్తాయి. హార్మోన్, కిడ్నీ సమస్యలను నయం చేయడం ద్వారా రక్తపోటును సులభంగా కంట్రోల్ చేయవచ్చు, అలాగే జీవితాంతం బిపి మందులు వాడాల్సిన అవసరం ఉండదు. ఎవరైతే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారో వారందరూ క్రమం తప్పకుండా ఇసిజి, 2డి ఇకో, క్రియేటిన్ వంటి పరిక్షలు ఎప్పటికప్పుడు చేయించుకుంటే మంచిది.

అధిక రక్తపోటును కేవలం మందులతో మాత్రమే కాకుండా జీవనశైలి మార్పుల ద్వారా సులభంగా నియంత్రించవచ్చు. రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం, బరువు తగ్గటం, ధూమపానం, మద్యపానం మానివేయడం, రోజు ఉప్పు తక్కువ మోతాదులో తీసుకోవడం, కొవ్వు తక్కువ ఉన్న ఆహారం తీసుకోవటం, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం లాంటి జీవనశైలి మార్పుల ద్వారా అధిక రక్తపోటును చాలామంది మందుల సహాయం లేకుండానే తగ్గించుకోవచ్చు. జీవనశైలి నిర్వహణ అనేది హైపర్‌టెన్షన్ చికిత్సలో ఒక ముఖ్యమైన భాగం. ఇవన్నీ పాటించిన తర్వాత కూడా ఎవరికైతే అధిక రక్తపోటు ఉంటుందో అలాంటి వారు క్రమం తప్పకుండా బిపి మాత్రలు వాడాల్సి ఉంటుంది. అలా చేయడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు, పక్షవాతం, గుండె సమస్యలు రాకుండా కొంతవరకు నియంత్రించవచ్చు.

కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - రెంటచింతల

భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యంలో భార్య లావణ్య(25) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పసర్లపాడులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రెంటచింతల ఎస్ఐ షమీర్ భాష తెలిపిన వివరాలు ప్రకారం చిలుకూరి కోటేశ్వర రావు,లావణ్యాలు భార్యాభర్తలు వీరికి ముగ్గురు ఆడపిల్లలు అయితే కోటేశ్వరరావు చెల్లెలు లక్ష్మి దాచేపల్లిలో ఇంటి నిర్మాణం చేస్తుండగా వారి పనికి పోవద్దని భార్య లావణ్య భర్త కోటేశ్వరరావుకు చెప్పింది అయినప్పటికీ లెక్కచేయకుండా సోమవారం పనికి పోవడంతో ఆగ్రహంతో వంట గదిలోకి వెళ్లి చీరతో స్లాబ్ ఒగ్గి కి ఉరేసుకున్నది కొనప్రాణంతో ఉన్న లావణ్యను రెంటచింతలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గురజాల డిఎస్పి పల్లపురాజు, సిఐ దార్ల జయకుమార్ బంధువులు తో సంప్రదింపలు జరిపి శాంతింపజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ జెడ్పిటిసి కస్నా నాయక్ మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మాజీ జెడ్పిటిసి కస్నానాయక్ (61) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదహాన్ని మంగళవారం సందర్శించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జడ్పిటిసి వైస్ చైర్మన్ ఎస్ నర్సిరెడ్డి,ఎంపీపీ దాసరి చౌడేశ్వరి,మాజీ జడ్పిటిసి ఎన్ భాస్కర్ రెడ్డి,మార్తుల ఉమామహేశ్వర్ రెడ్డి, పిచ్చిరెడ్డి ఉన్నారు. కస్నానాయక్ 2006లో ఆయన జడ్పిటిసిగా ఎన్నికయ్యారు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కారెంపూడి

మండలంలోని చింతపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహం మంగళవారం లభ్యమైంది.గ్రామ రెవెన్యూ అధికారి రోహిణి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో ఉన్న ఎన్ఎస్పి కుడి కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభమైనట్లు తెలిపారు. కాలవ కట్టపై ఎపి 07ఎఎ 747 నంబరు గల స్పెండర్ ప్లస్ వాహ నం ఉందని, మృతుడి వయస్సు 35-40 సంవత్సరాలు ఉండ వచ్చని అన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీఆర్వో రోహిణి ఇచ్చిన సమా చారం మేరకు ఎస్సై రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ముసిలయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయ పడ్డాడు . ఈ సంఘటన సత్తెనపల్లి మండలం నంది గామ అడ్డరోడ్డు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన కోడ రెక్కల ముసిలయ్య (60) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మోడీ జాన్ తీవ్రంగా గాయ పడ్డాడు. నందిగామ నుండి సత్తెనపల్లి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని సత్తెనపల్లి నుండి గుంటూరు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడ్డిన జాన్ ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో మాచవరంలో బావిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన నల్లగట్ల కార్తీక్ (15) ఇటీవల విడుదలైన పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యాడు. వేసవి సెలవుల్లో తన స్నేహితులతో కలసి సరదాగా పొలాల్లో గల బావి దగ్గరకు వెళ్ళారు. ఈ క్రమంలో బావిలోకి ఈత కోసం దిగిన కార్తీక్ గల్లంతయ్యాడు. దీంతో అతని స్నేహితులు భయంతో అక్కడి నుండి పరుగెత్తుకొని వెళ్లి అతని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు బావి దగ్గరకు వెళ్ళారు. లోతుగా ఉన్న బావి లోకి దిగేందుకు గ్రామ స్తులు భయ పడ్డారు. అనంతరం సమాచారం తెలుసుకున్న పోలీ సులు, రెవెన్యూ, అగ్ని మాపక శాఖల సిబ్బంది సంఘటనా స్థలా నికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ళ సహా యంతో, బావి లోని నీటిని ట్రాక్టర్ల సహాయంతో బయటకు పంపటం జరిగింది. కొన్ని గంటల తర్వాత మృతదేహం బయటపడింది. మృతుడి తండ్రి కొండలు, తల్లి అనూరాధ, సోదరీ వైష్ణవి ఉన్నారు.



నల్లగట్ల కార్తీక్

ఫణిదంలో వరిగడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదంలో ప్రమాదవశాత్తు వరిగడ్డి వామి అగ్నికి ఆహుతైంది. బత్తుల ఆంజనేయులుకు చెందిన మూడున్నర ఎకరాల వరి గడ్డి వామి మంగళవారం కాలిపోయింది. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఇంటి ముందు వేసిన వరిగడ్డి వామి ఎలా దగ్ధమైందో తెలియడం లేదని చెప్పాడు.

ఆ విమర్శలు అర్థరహితం

ప్రజాశక్తి-తాడేపల్లి

రెండు రోజుల క్రితం జరిగిన వేమారెడ్డి సన్మాన సభలో టిడిపిపై చేసిన విమర్శలు అర్థరహితమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు కొట్టిపారేశారు. అధికారంలో లేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో 15 రకాల సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు రూ.5కు కూరగాయాలని ఎమ్మెల్యే ప్రజలను మోసం చేశారని చెప్పారు. అన్న క్యాంటీన్‌లను ఎత్తివేశారని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మరియదాసు, ఇ.భాస్కర్, ఎ.మురళీ, మాజీ కౌన్సిలర్ చిన్నా, కె.సాయిచంద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వైసిసి నాయకులు నాజర్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలానికి మంగళవారం ఐదో విడత మత్స్య కార భరోసా పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సందర్భంగా పొన్నూరు పట్టణానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు షేక్ నాజర్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేశారు. . జగన్మోహన్ రెడ్డి యోగా క్షేమాలు అడిగినట్లు షేక్ నాజర్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

చిరువ్యాపారులకు వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం తోపుడుబండ్లు అందజేశారు. పట్టణంలోని కృష్ణనగర్‌కు చెందిన ఎలీషమ్మ, దారా లక్ష్మి, వై.కోటయ్య, ఎస్‌కె మహబూబ్ సుభానీ, ఎం.అచ్చయ్య చిరువ్యాపారానికి తోపుడు బండ్లు అందజేయాలని ఎమ్మెల్యే ఆర్‌కెకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన వెంటనే స్థానిక నాయకుల చేత మంగళవారం బండ్లు అందజేయించారు. ఈ కార్యక్రమంఒల వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, అనిల్, రసూల్, సిహెచ్.మధు, కె.శ్రీను, బి.కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

20 నుండి మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షెహర్

ప్రజాశక్తి-గుంటూరు

మేరీ లైఫ్- మేరీ స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా గుంటూరు నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) విధానాన్ని మే 20 నుండి జూన్ 5 వరకు అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పట్టణాభివద్ధి, గహ నిర్మాణ శాఖ జాతీయ స్థాయిలో నిర్వహించే మేరీ లైఫ్- మేరీ స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమం ద్వారా నగరవాసులు, వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న ఉపయోగించని, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పాద రక్షలు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఈ-వ్యర్థాలను నగరపాలక సంస్థకు అందిస్తే, వాటిని పునర్వినియోగం, పునరుద్ధరణకు, కొత్త ఉత్పత్తికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వస్తువుల సేకరణ ప్రాంతం, ఇతర అంశాలపై నగరంలో అన్ని వార్డు సచివాలయాల పరిధిలోని శానిటేషన్ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కేంద్రం ఇప్పటివరకు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గుంటూరు నగరపాలక సంస్థ ముందు భాగాన ఉందని, మేరీ లైఫ్-మేరీ స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలోనూ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంపై ఇంటి వద్దకు వచ్చే వాలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శుల ద్వారా వచ్చే ఆన్ లైన్ లింక్ ద్వారా ప్రతిజ్ఞ నిర్వహించి నగరపాలక సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో

ఐ.ఏ. 838/2021 ఓ.యస్.నెం. 426/2015

బిట్వీన్ :
షేక్ పార్వతి ... పిటీషనరు - వాది
ఎదిరి
1. షేక్ పెద ఆదం సాహెబ్ మరియు ఐదుగురు
... రెస్పాండెంట్లు - ప్రతివాదులు

టు
ఆర్-6 : కోటేళ్ళ శ్రీనివాసరెడ్డి, తండ్రి వెంకటేశ్వరరెడ్డి, వయస్సు 40 సం11లు, హిందువు, జీవనం వ్యాపారం, నివాసం డోరు నెం. 9-4-46, వడ్డవల్లి, సత్తెనపల్లి మున్సిపాలిటీ, సత్తెనపల్లి మండలం, మరియు పి.కె.సి.జె.సి.

పై నెంబరు దావాలో వాది లిస్టు దాఖలా డాక్యుమెంటు బట్టి 1 నుండి 5 ప్రతివాదులపై దావా దాఖలు చేసి వుండివున్నది. దరిమిలా ఈ దావాలో నిన్ను 6వ రెస్పాండెంటు-ప్రతివాదిగా చేర్పించమనిన్నీ (ఐ.ఏ.838/2021 ఇన్ ఓ.యస్.నెం. 426/2015 నెంబరుగల) పిటీషను దాఖలు చేయగా శ్రీ కోర్టువారి ద్వారా మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపించినన్నూ, మీరు వాటిని తీసుకొనక కాలయాపన చేయుట వలన శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం పేపరు పబ్లికేషన్ కోరుతూ ఆర్డరు వేసియున్నారు. కావున ది.18-5-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసి వుండివున్నది. అట్లు కాని యెడల సదరు దావాలోని పిటీషనుపై మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడునన్నీ యిందుమూలముగా మీకు తెలియజేయటమైనది.

సత్తెనపల్లి
ది.16-5-2023

ఇ.ఎల్లారెడ్డి
పిటీషనరు-వాది తరపు న్యాయవాది,
సత్తెనపల్లి, పల్నాడుజిల్లా.

నోటు : ఐ.ఏ. 636/2023 ఇన్ ఐ.ఏ. నెం. 838/2021 ఇన్ ఓ.యస్.నెం. 426/2015 నెంబరులలో సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసు సర్వు అగుటకు కోర్టువారి ఉత్తర్వులు వుండి వున్నందున
వాయిదా: ది.18-5-2023

లింకు డాక్యుమెంట్లు పోయినవి

పల్నాడుజిల్లా, సత్తెనపల్లి టౌన్ కాపురస్తులు చెరుకూరి వెంకట్రామయ్యగారి కుమారుడు చలమయ్య గారి ది.21-9-2019వ తేదీన శ్రీ సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం ద.నెం. 6688/2019 రుగా రిజిష్టరు కాబడిన దఖలు దస్తావేజు రీత్యా వడ్డవల్లి గ్రామ డి.నెం. 8-1ఎ1సి1 గుర్తులో చ.గ. 279.41లు గల స్థలము నాకు సంక్రమించినది. ఆ సదరు ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజు నెం. 278/1981 డాక్యుమెంట్స్ ది.11-5-2023న సత్తెనపల్లి ఎన్జీఓ హోం సెంటర్‌లో టీ స్టాల్ వద్ద పోగొట్టుకొనియున్నాను. ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనను దొరికినచో ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించగలరు.
సత్తెనపల్లి.
తేది: 16-5-2023

చెరుకూరి చలమయ్య,
తండ్రి: వెంకట్రామయ్య,
డోర్ నెం. 9-1-51, తాలూకా వద్ద,
పోలీస్‌స్టేషన్ ఎదురు, సత్తెనపల్లి టౌన్, పల్నాడుజిల్లా.
ఫోన్ : 9110347310

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో..
ఐపి నెం. 27/2021

బిట్వీన్.
తటవర్తి వెంకటేశ్వర్లు .... పిటిషనర్.
AND
కూనిశెట్టి శ్రీనివాసులు ... ఇతరులు రెస్పాండెంట్లు.
R1) కునిశెట్టి శ్రీనివాసులు S/o కెఎస్ఎల్ మహానంది, సిరి అపార్ట్మెంట్ ప్లాట్ నెం.506 శారదాంబ థియేటర్ వద్ద, ప్రకాష్ నగర్ నరసరావుపేట, పల్నాడు జిల్లా.
R2) విశ్వనాధుని వెంకటేష్ S/o హరి ప్రసాదరావు D.No. 11/126 రసూల్ పేట, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
R3) ఆలపాటి అనంత లీలావతి W/o ప్రసాదరావు ఫ్లాట్ నెం. ఫస్ట్ ఫ్లోర్ 1, అఖిల అపార్ట్మెంట్స్, 35 ఎస్బిఐ ఆఫీసర్స్ కాలనీ, ఏ ఆర్ నగర్, బెంజ్ సర్కిల్ విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా.
R4) జయవరపు లక్ష్మి W/o కృష్ణమూర్తి డోర్ నెం. 3-8-8, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
R5) జయవరపు బద్రి బాబు S/o కృష్ణమూర్తి ఫ్లాట్ నెం. 307 తిరుమల ప్యాలెస్, సింధు బ్లాక్, రాజా గారి కోట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
R6) విశ్వనాధుని పద్మశ్రీ w/o ప్రసాదరావు D/o జయవరపు కృష్ణమూర్తి, డోర్ నెం. 11/126 రసూల్ పేట, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
R7) చేవూరి పద్మావతి w/o రాధాకృష్ణ ఫ్లాట్ నెం. 508, శ్రీ ఎస్టేట్, ప్రకాష్ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
R8) కూనిశెట్టి లక్ష్మయ్య S/o శివ లక్ష్మణ మహానంది, డోర్ నెం. 12-8-7-6/A ప్రకాష్ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

సదరు పై నెం. ఐపి లోని పిటిషనర్ ఇందలి రెస్పాండ్లపై క్రెడిటార్ ఐపి దాఖలు చేసి ఉన్నారు. సదరు క్రెడిటార్ ఐపీలో ఇతరులకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ఐపీలో చూపబడిన రెస్పాండెంట్లు కాకుండా ఇంకనూ ఇతరులు ఎవరైనా ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట ది. 16-06-2023వ తేదీన ఉదయం 10:30 ని.లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది: 16-6-2023

ఇట్లు.
శ్రీగిరిరాజు నాగేశ్వరరావు,
పిటిషన్ తరపు న్యాయవాది,
నరసరావుపేట పల్నాడు జిల్లా.
Cell.No: 9441081262.

అభివృద్ధి పనులను 146 జీవో ప్రకారం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లోని 21.22 ఎకరాల ఎన్‌ఎస్‌పి భూమిలో 146 జీవో ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎవిఎన్ గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎ.ఆంజనేయులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. గోపాలరావు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌పి మిగులుగా ఉన్న భూమిని ఫిబ్రవరి 2019లో ఉన్నతాధికారులు వినుకొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా సర్వేనెంబర్ 399/ఏ లో 7.24 ఎకరాలు, 400,401 సర్వే నెంబర్లలో 13.23 ఎకరాలు మొత్తం 21.22 ఎకరాలు భూమిని రెవెన్యూకు బదలాయించారని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎన్‌ఎస్‌పి స్థలంలో వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం, వెలుగు ఆఫీస్ బిల్డింగ్, పోలీస్ క్వార్టర్స్, రైతు బజార్, లైబ్రరీ బిల్డింగ్, షాదీఖానా బిల్డింగ్, షాపింగ్ కాంప్లెక్స్, ఇండోర్, అవుట్డోర్ స్టేడియం, టిటిడి కళ్యాణ మండపం పార్కు వాకింగ్ ట్రాక్ ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు భూమిని కేటాయిస్తూ నాడు మునిసిపల్ కౌన్సిల్లో తీర్మానం చేశారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం 146 జీవోనూ విడుదల చేసిందని, అయితే దానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్‌ఎస్‌పి కాలనీ నివాసితులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. 196 క్వార్టర్స్ కాలనీలో ఉండగా 50 మాత్రమే శిథిలావస్థలో ఉన్నాయని, నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా, ఎన్‌ఎస్‌పి అధికారుల అనుమతులు లేకుండా క్వార్టర్స్‌ను కూల్చి వేయించడం దుర్మార్గమన్నారు. భూమిని చదును చేసి దానిలో 12.39 ఎకరాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి చిరు వ్యాపారులకు, బాధిత నివాసితులకు అన్యాయం చేయాలని చూడటం అనాలోచితమని చెప్పారు. వినుకొండ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు వినుకొండ అభివృద్ధిలో అఖిలపక్షాలను ఏర్పాటు చేసుకొని అభిప్రాయాలు వారి ఆమోదంతో పనులు చేశారని, ప్రస్తుతం ఎమ్మెల్యే బొల్లా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో ఒక్క అఖిలపక్షాన్ని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఎన్‌ఎస్‌పి స్థలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై అఖిలపక్షంతో చర్చించాలని, నిర్మాణ పనులపై కోర్టు వరకు వెళ్లకుండా నిరోధించాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రామఎలె తిరుమల లక్ష్మి, రంజాన్‌బి, నాసర్‌బి, కరుణ, నాసర్‌వలి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎవిఎన్ గోపాలరావు

కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి

ఉపాధి హామీ పనులను పాత పద్ధతిలోనే చేయించాలి : వ్యకాస

ప్రజాశక్తి - అచ్చంపేట

ఉపాధి హామీ పనులను పాత పద్ధతుల్లోనే చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం చేపట్టిన యాత్రలో భాగంగా మండలంలోని చెరుకుంపాలెంలో పని ప్రదేశాలను మంగళవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, 20 మందికి ఒక మేట్ పద్ధతి కొనసాగించాలని, మేట్ ఒక్కొక్క రోజుకి ఒక్కొక్క కూలితో పని చేయించినందుకు రూ.10 అలవెన్స్ ఇవ్వాలని కోరారు. తాగునీరు, పనిముట్ల అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై ఈనెల 22న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్రీడాకారుణులను పరిచయం చేసుకున్న ఎస్ఐ అమీర్, అలయకమిటి ఛైర్మన్ ప్రసాదరెడ్డి

ఫైనల్ దశకు చేరిన మహిళల కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - బెల్లంకొండ

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మహిళలు క్రీడల్లో ప్రతిభ కనపరచడం గర్వించదగ్గ విషయమని బెల్లంకొండ ఎస్ఐ అమీర్ అన్నారు. బెల్లంకొండ అడ్డ రోడ్డులోని కోళ్లూరు ఆంజనేయస్వామి వారి ఉత్సవాల సందర్భంగా రెండ్రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు తుది అంకానికి చేరుకున్నాయి. మంగళవారం మహిళ కబడ్డీ ఫైనల్స్‌లో ప్రసన్నాంజనేయ కొళ్లూరు టీమ్, విజయవాడ టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను ఎస్ఐ అమీర్, అలయకమిటి ఛైర్మన్ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు.

19న సుందరయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పుచ్చలపల్లి సుందరయ్య 38 వర్ధంతి సభను 12వ వార్డులో పిల్ల అంకమ్మ చౌక్ వద్ద 19వ తేదీ రాత్రి ఏడు గంటలకు నిర్వహిస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రదర్శన కర్రసాముతో ప్రదర్శన ఉంటుందని, అనంతరం నిర్వహించే బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, నాయకులు బి.శంకరరావు, పి.సుబ్బారావు, ఇతర నాయకులు పాల్గొంటారని చెప్పారు. అదేరోజు ఉదయం ఆరంజి సెంటర్ వద్ద ఉన్న సిపిఎం జెండావిష్కరణ ఉంటుందని తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

45 మంది ఎంఎఎం ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

మండలంలోని కేసనపల్లి గ్రామ పరిధిలో గల ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో దివీస్ లబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో చివరి సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థులు 45 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ హెచ్.ఆర్ ప్రతినిధులు కె.హరికృష్ణ, పూర్ణప్రసాద్ పర్యవేక్షణలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టినట్లు తెలిపారు. రాత పరీక్ష, బృంద చర్చలు, సాంకేతిక విభాగాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 150 మంది పాల్గొనగా 45 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి రూ.3 లక్షల వార్షిక వేతనం వస్తుందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మెదరమెట్ల రామశేషగిరిరావు అభినందించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి దిశా నిర్దేశం చేయడం ద్వారా ఫార్మసీ రంగంలో ఐ.టి రంగానికి దీటుగా జీవితంలో ఉన్నతంగా స్థిరపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా రేపు కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - నరసరావుపేట

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ ఇంకా చర్యలు తీసుకోపోవడం సిగ్గుచేటని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ విమర్శించారు. వేధింపులకు నిరసనగా రెజర్లు చేపట్టిన ఆందోళనకు సంఘీభావంగా పట్టణలో గురువారం స్థానిక సత్తెనపల్లి రోడ్డులో గల జిల్లా క్రీడా ప్రాంగణంలో సిఐటియు, ఐద్వా, రైతు, కౌలు రైతు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తామని తెలిపారు. ఈ మేరకు పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒక వైపు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూనే ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లి లాంటిదని మోడీ ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. తమకు వేధింపుల నుండి రక్షణ కల్పించాలని, ఎంపీని అరెస్టు చేయాలని మహిళా రెజ్లర్లు ఢిల్లీలో నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహిళలు ఇప్పుడిప్పుడే పురుషులకు ధీటుగా వివిధ రంగాల్లో నిలబడుతున్నారని, ఇలాంటి ఘటనల వల్ల వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించడం తగ్గుతుందని ఆందోళన వెలిబుచ్చారు. తమ క్రీడా నైపుణ్యంతో దేశ కీర్తిని ప్రపంచ దేశాల్లో ఎలుగెత్తి చాటిన మహిళా క్రీడాకారులు పట్ల ఇంత నిరంకుశంగా వ్యవహరించడం క్షమించరానిదన్నారు. అయినా ఈ అంశాలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన ఖండించకపోవడంతో శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో రెజ్లర్లకు మద్దతుగా అన్ని ప్రాంతాల్లోనూ నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు.

క్షయబాధితులకు నాలుగో విడత పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - నరసరావుపేట

2025 నాటికి క్షయ వ్యాధి రహిత భారతదేశం సాధనలో భాగంగా సర్వేల ద్వారా క్షయ కొత్త కేసులు నిర్ధారణ చేసి 6 నెలల పాటు పూర్తిగా చికిత్స అందించనున్నట్లు పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి అన్నారు. నిక్షయ మిత్ర ఫుడ్ బాస్కెట్స్ నాలుగో విడత పంపిణీని స్థానిక పల్నాడు రోడ్డులోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ చికిత్స పొందుతున్న వారు ఆరోగ్యంగా ఉండటానికి, మరణాలు రేటు తగ్గించడానికి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కృషితో ఫిబ్రవరి 2023 నుండి ప్రతినెల 600 మంది క్షయ బాధితులకు పౌష్టికాహారం కిట్స్ అందిస్తున్నట్లు చెప్పారు. 6 నెలలపాటు క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటే క్షయను పూర్తిగా నయం చేయొచ్చని, చికిత్సతో పాటు పోషకాహారమూ తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. ఈ వ్యాధి గాలిలో తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందని, మందులు తీసుకున్న వారు కుటుంబ సభ్యులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా టిబి - లెప్రసి ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ కె.పద్మావతి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టిబి వ్యాధి నిర్ధారణకు పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, 15 రోజులకు మించి దగ్గు ఉండి కళ్లె రావడం, రక్తం రావడం, బరువు తగ్గడం ఆకలి మందగించడం వంటి లక్షణాలున్న వారు తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

22న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి - పెదకాకాని : పెదకాకాని మండలంలో ఉపాధి కూలీలకు గత సంవత్సరం రావలసిన రూ.12 లక్షల 88 వేల 686 వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకాకాని మండలంలోని గొళ్ళమూడి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించి ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేసిన డబ్బులు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని దానిలో భాగమే నిధులు తగ్గించేసారని తెలిపారు. అలాగే రెండు పూటలా పని విధానం తీసుకువచ్చారన్నారు. గతంలో ఇచ్చిన సదుపాయాలను కూడా తీసివేశారని, ఎక్కడ కూడా మెడికల్ కిట్లు గాని, టెంట్లు గాని, పలుగు, పారుకు డబ్బులు ఇవ్వటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అలాగే గతంలో ఇచ్చిన సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు. ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారానికి 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనలో పాల్గొనాలని కోరారు.

గోళ్లమూడిలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

కాజలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పలు గ్రామాల్లో వినతులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ : గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లో విలీనం అయిన గ్రామాల్లో కూడా అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల అభివద్ధి అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పని ప్రదేశంలో ఉపాధి కార్మికులకు తాగునీరు, టెంట్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్ష కార్యదర్శులు గడ్డం అజయ్ కుమార్, ఇంటూరు సీతామహాలక్ష్మి, భీమిరెడ్డి శివారెడ్డి, పి.అప్పారావు, కె. సంగీతరావు, సిహెచ్ కోటేసు, వి.దుర్గారావు పాల్గొన్నారు. కాజా గ్రామంలో సిసి రోడ్లను, డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు నాయకులు తెలిపారు.

సిరిపురంలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మేడికొండూరు : ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కారం చేసేందుకు 22న గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు బి రామకృష్ణ కోరారు. మంగళవారం మండలంలోని సిరిపురంలో ఉపాధి పని ప్రదేశంలో కొండెపోగు వెంకట్రావు, దుర్గం వీరాంజనేయులుతో కలసి పనిశీలించి, కూలీలతో మాట్లాడారు. అనంతరం పంచాయతీ అధికారి వెంకట్రాయుడికి వినతి పత్రం అందజేశారు.

గొడుగు నుంచి పుష్పగుచ్ఛం...

12వ రోజూ విద్యార్థులను ఆకర్షించిన మ్యాజిక్

ప్రజాశక్తి-తాడేపల్లి : గత 12 రోజల నుంచి మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్లో జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా శిబిరం ముగింపు దశకు వచ్చింది. 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ రాఘవయ్య పార్కు వద్ద గల ఎంబివికెలో పిల్లలు మ్యాజిక్‌ను ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. బుధవారం కూడా నేర్చుకున్న అంశాలపై విజయవాడ ఎంబివికెలో శిక్షణ ఉంటుందని ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ తెలిపారు. 15 రకాల మ్యాజిక్ ట్రిక్కులు పిల్లలకు ఆయన నేర్పించారు. వీటిల్లో ఒక్కో దానిలో ప్రతిభ కనబర్చిన వారిని అందుకు ఎంపిక చేసి బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు క్రాంతికార్ తెలిపారు. 18వ తేదీ మ్యాజిక్ నేర్చుకున్న పిల్లల తల్లిదండ్రులు, వారి బంధువులు ఎంబివికె ఆడిటోరియంకు రావాలని కోరారు. మంగళవారం గొడుగు నుంచి వివిధ రకాల పుష్పగుచ్చాలను తెప్పించే మ్యాజిక్‌ను పిల్లలతో చేపించారు. దీంతో పిల్లలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అలాగే స్టీల్ కర్ర నుంచి పక్షి ఈకలను తెప్పించారు. ఓ పెద్దకర్రను చేతిలో తిప్పుతూ అంతలోనే రెండు రకాల జెండాలు రెండు చేతుల్లోకి రావడం నేర్పించారు. ఈ సందర్భంగా బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని మెరుగ్గా తీర్చిదిద్దడానికి మ్యాజిక్‌లో నేర్చుకున్న వివిధ అంశాలు ఉపయోగపడతాయని చెప్పారు. క్రాంతికార్ లాంటి ఇంద్రజాలికులు ఈ ప్రాంత పిల్లలకు మ్యాజిక్‌లో శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. వేసవి సెలవులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఎంటిఎంసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. పిల్లలకు ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ప్రశ్నించేతత్వం అలవడుతుందని చెప్పారు. మ్యాజిక్ శిక్షణా శిబిరాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులు, అడగ్గానే ఏర్పాట్లు, ప్రతిరోజూ విద్యార్థులకు రాగిజావ, ఆవు పాలు అందజేసిన అరవింద స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రజాలికులు గాజుల పిచ్చయ్య పాల్గొన్నారు.

చేబ్రోలులో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

పని ప్రదేశంలో రక్షణ ఏర్పాట్లు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - చేబ్రోలు

భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో పని ప్రదేశంలో ప్రత్యేక వసతులు కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చేబ్రోలులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో కార్మికులు పని ప్రదేశంలో అధిక ఉష్ణోగ్రతలకు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముందని, వీరికి మంచినీళ్లు, ఇతర రక్షణ సౌకర్యాలు అందుబాటులో ఉంచే విధంగా బిల్డర్స్, కాంట్రాక్టర్లకు లేబర్ అధికారులు తగిన సూచనలు చేయాలని కోరారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలని, వైఎస్ఆర్ బీమా కుటుంబంలో పనిచేసే అందరికీ వర్తించే విధంగా జీవో సవరణ తేవాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇమాంస, రవి, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. .

మూఢనమ్మకాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-తాడేపల్లి

పిల్లలు చిన్నతనం నుంచే మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని విశ్రాంత ఎంపిడిఒ ఆర్.ఆదినారాయణ రావు అన్నారు. తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండుతున్న కర్పూరాన్ని నోట్లో వేసుకుని మింగేశారు. మరికొన్ని మ్యాజిక్ ట్రిక్కులు చేసి చూపించారు. బాబాలు, తాయిత్తుల మహిమలు అంతా భ్రమేనని అన్నారు. ఈ సందర్భంగా మూఢ నమ్మకాలపై చెప్పిన కథ 'ఎవరి ముఖం చూశానో ఈ పొద్దున' అనే కథ పిల్లలను ఆలోచింపజేసింది. మరికొన్ని ప్రశ్నలు సంధించి పిల్లల నుంచి సమాధానాలు రాబట్టారు. పిల్లలు మరింత ఉత్సాహంగా ఆయన్ను ఫాలో కావడంతో మరో 25 నిముషాలు అదనంగా ఆయన పిల్లలతో ఇంట్రాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనా దృక్పదాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని చెప్పారు. బాలల్లో ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. మనకు ఎంతో ఇచ్చిన ఈ సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని, సామాజిక స్పృహను అలవర్చుకోవాలని కోరారు. ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ, డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు లక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివరావు సైన్స్ సంగతులతో పాటు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మర్ క్యాంపు నిర్వాహకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సోలా ముత్యాలరావు, భీమవరపు దశరథరామిరెడ్డి, పాల్గొన్నారు.

గ్రౌండ్స్‌మెన్ రాజేష్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక బిఆర్ స్టేడియం, క్రీడాప్రాధికార సంస్థలో గ్రౌండ్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న జి.రాజేష్‌కు ఆపరేషన్ ఖర్చుల కోసం స్టేడియం హెల్త్‌క్లబ్ జిమ్ సభ్యులు, అధ్యక్షులు కెకెఎస్‌వి.ప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎస్‌డి.సుభాని, సత్యం, నవీన్ స్పందించి రూ.33వేలు ఆర్థిక సాయం చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు చేతులమీదుగా అందచేశారు.

నేడు ఓపీఎస్ సాధన సమితి సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఓల్డ్ పెన్షన్ విధానం సాధన సమితి జిల్లా కార్యవర్గ సమాశం నేడు స్థానిక నగరంపాలెంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని, ఓపిఎస్ సాధించే వరకూ ఈ కమిటీ పోరాడుతుందని అన్నారు. కావున సిపిఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం జువాలజీ అధ్యాపకురాలు మణి సైన్స్ సబ్జెక్ట్‌లో రూట్ సిస్టిమ్, షూట్ సిస్టమ్ పార్ట్స్ ఫంక్షన్స్ గురించి వివరించారు. న్యూట్రియంట్స్ గురించి వివరించి, పిల్లలతో సమీక్షించారు. తదుపరి పిల్లల మానసిక వికాసం కోసం కథలు చెప్పి వారి శారీరక ఉల్లాసం కోసం కబడ్డీ ఆడించారు. ఈ వేసవి శిబిరంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదకాకాని ధర్నాలో మాట్లాడుతున్న ఎన్ శివాజి

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న టెండర్ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి డిమాండ్ చేశారు. మంగళవారం పెదకాకాని పంచాయతీ కార్యాలయ వద్ద గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగదా పి ఆదిలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమంలో శివాజి మాట్లాడారు. టెండర్ కార్మికుల టెండర్ ఖరారుకు అసాధారణమైన సమయం తీసుకుంటున్నారని ప్రస్తుత సంవత్సరం ప్రారంభమై ఇప్పటికీ రెండు నెలలు గడిచిన చాలా పంచాయతీల నుండి ప్రతిపాదనలే తయారు చేసి పంపని దుస్థితి నెలకుందన్నారు. దీనివలన పంచాయతీ టెండర్ కార్మికులు నెలవారి జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రీన్ అంబాసిడర్లకు రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని ఇది ప్రస్తుత ధరల నేపథ్యంలో కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాన్ని రూ.15వేలుగా నిర్ణయించి దని, గ్రీన్ అబాసిడర్లకు కూడా వర్తింపచేయాలన్నారు. ప్రస్తుతం ఇచ్చే కొద్దిపాటి వేతనం కూడా నాలుగు నెలలుగా పెండింగ్ ఉందని, నాలుగు నెలలు జీతాలు ఇవ్వకుంటే వారు ఏమి తిని బ్రతకాలని వెంటనే పెండింగ్ జీతాలు, యూనిఫామ్ వేతనంతో కూడిన వారంతపు సెలవులు, పండుగ సెలవులు క్యాజువల్ లీవులు ఇవ్వాలని గుర్తింపు కార్డులు సబ్బులు నూనె మాస్కులు ఇవ్వాలని ఎండలకు వడదెబ్బ తగలకుండా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ప్రతినెల జీతాలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం 18వ తేదీన గుంటూరు డిపిఒ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో పంచాయతీ కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ కార్మికులు సకిలి జైపాల్ వరికుంట ఆవాజ్ నాగలక్ష్మి రామస్వామి తదితరులు పాల్గొన్నారు



రోడ్లను ప్రారంభించిన అనంతరం స్థానికులతో ఎమ్మెల్యే

పుట్లగూడెం, చింతపల్లి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్చంపేట

చింతపల్లి, పుట్లగూడెం గ్రామాల ప్రజలకు రెండు దశాబ్ధాల కలగా ఉన్న తారు రోడ్డును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ రెండు గ్రామాలు మెయిన్ రోడ్డు నుండి కిలోమీటర్ల కాలినడకల వెళ్లాల్సి ఉంది. రహదారుల అధ్వానంగా ఉండటంతో గ్రామాల్లోకి ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో మెయిన్ రోడ్డు నుంచి పుట్లగూడెం వరకు మార్కెట్ యార్డు నిధులు రూ.25 లక్షలు, మెయిన్ ఆర్ అండ్ బి రోడ్డు నుంచి చింతపల్లి వరకు మార్కెట్ యార్డు నిధులు మరో రూ.25 లక్షలతో నిధులు కేటాయించి తారు రోడ్లు నిర్మించారు. ఎమ్మెల్యే వెంట జెడ్‌పిటిసి టి.విజయప్రతాపరెడ్డి, సిహెచ్.చంద్రయ్య, బి.కృష్ణనాయక్, చిన్నపరెడ్డి, ఇతర కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించి నీరు తాగుతున్న ఎమ్మెల్యే తదితరులు

నాలుగు చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు పురపాలక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రధాన రహదారుల మధ్య 4 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని చలివేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. వేసవి ఎండలు అధికంగా ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ ఛైర్మన్ తురకా కిషోర్, కామనబోయన కోటయ్య, కమిషనర్ ఇవి రమణబాబు, కౌన్సిలర్లు పోలా శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వర్లు, ఏసోబు, షేక్ సుభాని, గట్ల కోటిరెడ్డి, మున్నా మురళి,మంద సంతోష్, గురవయ్య, జగన్నాథం, మార్కెట్ యార్డు ఛైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన అమరావతి నూతన సిఐ

ప్రజాశక్తి-నరసరావుపేట

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అమరావతి పోలీస్ స్టేషన్‌లో సిఐ బాధ్యతలు చేపట్టిన ఎవి బ్రహ్మం మంగళవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలని, ప్రజల భద్రతతోపాటు శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని ఎస్పీ సూచించారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిఐ

సిసిఆర్‌సి కార్డుల కోసం కౌల్దార్లు దరఖాస్తు చేసుకోండి

- పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి
- పలు గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు సమాయత్తం సభలు

రైతులకు స్ప్రేయర్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-నరసరావుపేట

రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందజేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు సకాలంలో అందించి పంట రుణాలు పొందేందుకు సహకరించాలని సిబ్బందిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి ఆదేశించారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇక్కుర్తి రైతు భరోసా కేంద్రంలో రైతు సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కౌలు రైతులందరూ రైతు భరోసా సిబ్బందిని, విఆర్వోలను సంప్రదించి 23-24 ఏడాదికి సంబంధించి సాగు ధ్రువపత్రం (సిసిఆర్‌సి) కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు జీలుగా, జనుము, పిల్లిపెసర విత్తనాల ద్వారా పొలం సూక్ష్మ పోషకాలను వృద్ధి చేయాలన్నారు. రైతులకు కావలసిన నాణ్యమైన పత్తి, మిర్చి హైబ్రిడ్ విత్తనాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రైతులు జెఎల్‌జి గ్రూపులుగా ఏర్పడి రైతు భరోసా కేంద్ర సిబ్బంది ద్వారా బ్యాంకు నుండి రుణాలు తీసుకోవాలని, పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని ఉచిత పంటల బీమా పథకం పొందాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాలు ఆధారంగా రాబోయే ఖరీఫ్ సీజన్ పంటలను ఎరువులు వేసుకోవాలని సూచించారు. భాస్వరం ఎరువుల వినియోగం తగ్గించాలని, జీవన ఎరువులు వినియోగించి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించాలని అన్నారు. అనంతరం రాయితీపై యంత్రాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఏడీఏలు పి.మస్తానమ్మ, ఎం.శివకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు, సర్పంచ్ పి.రామయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి నవీన్, పశువిజ్ఞాన శాఖ అధికారి డాక్టర్ ఉషారాణి, నీటిపారుదల శాఖ ఏఈ వాణి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వి.లక్ష్మి, ఎఇఒ గోపిరెడ్డి, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.పావని, జి.రవితేజ, విఆర్వో జానీ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని మండలంలోని వన్నాయపాలెంలో మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ పొలాల్లోని పంట అవశేషాలను తొలగించి, వాలుకు అడ్డంగా వేసవి లోతు దుక్కులు దున్నుకోవాలని సూచించారు. పంట మార్పిడి చేయలని చెప్పి పంట రకాల ఎంపిక, విత్తన శుద్ధి, మొలకశాతం కట్టుట, విత్తనాలు కొనుగోలులో పాటించాల్సిన పద్ధతులపై వివరించారు.

వన్నాయపాలెంలో మాట్లాడుతున్న బెల్లంకొండ ఏవో

భూసార పరీక్షల చేయించుకోవాలని, ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని చెప్పారు. రైతు భరోసా- పిఎం కిసాన్, యంత్రసేవ ద్వారా డ్రోన్స్ వినియోగించుట, కౌలు రైతులకు పంట సాగు దారు హక్కు పత్రాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట ఎరువులు అందజేత తదితరాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.కోటేశ్వరరావు పిఎండిఎస్‌లో 30 రకాల విత్తనాలు నాటడం వల్ల వచ్చే ప్రయోజనాలు తెలిపారు. పంట రుణాలు పొందే విధానాన్ని చెప్పారు. రైతు భరోసాకు అర్హులైన రైతులంతా ఈనెల 18 వతేదిలోగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. విఆర్ఒ మస్తాన్‌వలి మాట్లాడుతూ కౌలురైతులందరూ పంట సాగు దారు హక్కు పత్రం (సిసిఆర్‌సి) పత్రం పొందాలన్నారు. పంటల భీమా, కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు తదితరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ అభ్యుదయ రైతులు సోమయ్య, కోటినాగయ్య, సురేష్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో ర్యాలీ

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమీ కోరారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మలేరియా వైద్య ఆరోగ్య మున్సిపల్ సిబ్బంది సత్తెనపల్లి పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లక్కరాజు గార్లపాడు సెంటర్లో మానవహారం అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు జి.ధర్మ, షేక్ మహబూబ్ అలీ, షేక్ సిరాజున్నీసా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి హెల్త్ అసిస్టెంట్లు ఎస్‌ఎం హుస్సేన్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ప్రదర్శనలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ఇంటి లోపల, ఆవరణలో ఉన్న కొబ్బరి బొండాలు, టీ కప్పులు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వాటిలో ఏడిస్ అనే దోమలు గుడ్లు పెట్టి లార్వాలుగా మారి పెద్ద దోమలుగా మారి మనుషులను కుట్టటం వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని తెలిపారు. డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతిభాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎఎన్‌ఎంలు భారతి, పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచవరం

మండలంలోని పిన్నెల్లి-1 పరిధిలోని ఎస్సీ కాలనీలో అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారులు పట్టాభి, సురేష్, హెల్త్ సూపర్వైజర్ ప్రభాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ అబ్దుల్, బాలనగామ్మ, శివకుమారి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని పల్నాడు జిల్లా డిసిహెచ్‌ఎస్ (జిల్లా కో-ఆర్డినేటర్ హాస్పిటల్స్ సర్వీసెస్) డాక్టర్ రంగారావు మంగళవారం తనిఖీ చేశారు. పలు వార్డుల్లో పరిశీలించి అక్కడ వైద్యం పొందుతున్న వారితో మాట్లాడారు. గతంకంటే వైద్యుల సంఖ్య మెరుగైందని, సేవలు ఇంకా మెరుగావ్వాలని సూచించారు. కాన్పులు పెరిగాయని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, సాధారణ ఆపరేషన్లు, హెర్నియా, హైడ్రోసెల్, అపెండిసైటిస్ తదితర సేవలు అందుతున్నాయని అన్నారు. అనంతరం నూతన ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఇంచార్జి డాక్టర్ లక్ష్మీకుమారి, సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్‌ఎంఒ మోజెస్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో సంతగుడిపాడులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావు ప్రారంభించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని శాఖా గ్రంథాలయాధికారి కోసూరు వెంకట్రావు తెలిపారు.

ఉపాధ్యాయులు హక్కుల కోసం పోరాడాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-తెనాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉండి, హక్కుల కోసం పోరాడాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక కొత్తపేట ఎన్జీవో కల్యాణ మండపంలో మంగళవారం యుటిఎఫ్ తెనాలి ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు ఉద్యమ శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్ష/రాలు ఏఎన్ కుసుమకుమారి ఆవిష్కరించారు. శిక్షణను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కళాధర్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యావిదానంలో ఎన్‌సిఈ ఆర్‌టి మార్పులు స్వాగతించదగినవే కానీ, చరిత్రను భావితరాలకు తెలియకుండా మరుగు పరచటం సరి కాదన్నారు. కోవిడ్ సమయంలో సిలబస్ తగ్గించాలన్న తలంపు విద్యార్థులకు ఒకింత వెసులుబాటు కలిగిం చినా, డార్విన్ పరిణామ సిద్ధాంతం, జమ్మూకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి ఆర్టికల్ 370, గోద్రా ఊచకోత, కాంగ్రెస్ విద్యామంత్రి అబుల్ కలామ్ అజాద్ వంటి పాఠ్యాంశాలను తొలగించటం దారుణమన్నారు. ఉపా ధ్యాయ పోరాటాల్లో ఇలాంటి అంశాలు కీలకమేనని చెప్పారు. కుసుమకుమారి మాట్లాడుతూ ఉపా ధ్యాయులు విధులు నిర్వహిస్తూనే హక్కులకోసం పోరా డాలని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటిఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఉపాధ్యాయ ఉద్య మం గురించి ఆదినారాయణ ప్రత్యేకంగా వివరిం చారు. కార్యక్రమంలో పివి శ్రీనివాసరావు, జి.వెంక టేశ్వరరావు, శివపార్వతి, ఆర్థిక సెక్రటరీ గయా నుద్దొలా, కె.సాంబశివరావు, షకీల, కామాక్షి, బసవేశ్వం ౼రావు, గురుబ్రహ్మం, శ్రీదేవి, నర్సయ్య పాల్గొన్నారు.

ఊపందుకున్న పసుపు అమ్మకాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యాడ్ లో మంగళవారం రికార్డ్ స్థాయిలో 27 61 క్విం టాళ్ల పసుపు అమ్మకాలు జరిగాయి. ధరలు కూడా పెరగడంతో యార్డుకు అధిక మొత్తంలో పంట అమ్మకానికి వస్తుంది. సోమవారం ఈ సంవత్సరానికి మ్యాజిక్ ఫిగర్ గా భావించే ఆరువేల రూపాయలు మార్కు దాటడంతో యార్డుకు అధిక మొత్తంలో రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. దీనితో యార్డులో షెడ్డులు కిటకిటలాడుతు న్నాయి. కడప నుండి కూడా లారీల్లో పసురావటం ప్రారంబ ౖమైంది. ఇంకా అధిక మొత్తంలో పంట వస్తుందని ఆశిస్తున్నారు. మంగళవారం క్వింట గరిష్ట ధర 6300 రూపాయలు పలికింది. చేతినిండా పని దొరకడంతో హమాలీలు బిజీబిజీగా ఉన్నారు.

మోకాళ్ల పై నిలబడి అసైన్డ్ రైతుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధానిలో పేదలకు సెంటు స్థలం పంపిణీని జగన్నాటకంగా అసైన్డ్ రైతులు అభివర్ణించారు. రాజ కీయ ప్రయోజనాల కోస మే సెంటు భూమి అంటూ ప్రభు త్వం డ్రామా లాడుతోం దన్నారు. పేదలకు టిడ్కో గృహాలు ఇవ్వకుండా, చెప్పినమాట ప్రకారం అమరావతి సామాజిక ఫించన్ రూ.2500 ను రూ 5 ,000 కు పెంచకుండా,విచారణ పేరుతో కౌలు చెల్లించ ౕకుండా సెంటు స్థలం పేరుతో పేదల జపం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పట్టా భూములతో సమాన ప్యా కేజీ కి దిక్కు లేదన్నారు. వైసిపి పాలనలో రాజ ధానిలో దళితులు,పేదలు దుర్భర జీవనం గడుపు తున్నారని, రాజధానిని అభివద్ధి చేయ కుండా బయటి ప్రాంతాల వారికి ఉపాధి ఎలా కల్పిస్తుందో ప్రభుత్వం చెప్పాలన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 1246వ రోజుకు చేరాయి. తుళ్లూరు, నెక్కల్లు, ఉద్దండరాయుని పాలెం, వెలగపూడి,వెంకట పాలెం తది తర గ్రామాల్లో దీక్షలు సాగాయి.అమరావతి వెలుగు కార్య క్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి 'బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్' అంటూ నినాదాలు చేశారు.

తెనాలిలో

మంగళగిరిలో

కొల్లిపరలో

'డెంగీ' అవగాహన సదస్సులు, ర్యాలీలు

ప్రజాశక్తి-తెనాలి:

ప్రజల్లో అవగాహన కల్పించటంద్వారానే డెంగ్యూ వ్యాదిని నిర్మూలించగలమని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అన్నారు. ప్రపంచ డెంగీ దినోత్స వం సందర్భంగా పురపాలక సంఘం, మలే రియా, ఫైలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్లో నిర్వ హించిన సదస్సులు చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరి సరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే డెంగీ నివారణకు దోమల నివారణే ముఖ్యమన్నారు. ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బ రాయన్ మాట్లాడుతూ దోమల నియంత్రణకు అధికారులతో పాటు సమర్ధవంతమైన సమాజ భాగ స్వామ్యం కూడా అనివార్యమన్నారు. జ్వరపీడితులుగా ఉన్న వారు ఏఎన్‌ఎంను సంప్రదించి, రక్తపరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. కమిషనర్ ఎం.జస్వంతరావు, అసిస్టెంట్‌కమిషనర్ ఎం.గోపాల రావు, ఎంహెచ్‌వో కె.సిహెచ్ నిర్మల సదస్సులో మాట్లాడారు. **మంగళగిరి:** పరిసరాల పరిశు భ్రతతోనే డెంగ్యూ నివా రణ సాధ్యపడుతుందని నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి అన్నారు. జాతీయ కేంద్ర కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ, మలేరియా శాఖల సంయుక్త ఆధ్వ ర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కార్పొ ేంషన్ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి పతి మాట్లా డారు. **కొల్లిపర:** కొల్లిపర మండల పరిషత్ కార్యా లయం నుండి గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వ హించారు. డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చిక్కాల లక్ష్మీ సుధా మాట్లాడారు. **తాడికొండ:** జాతీయ డెంగూ దినోత్సవం సందర్భంగా పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నుండి ఎస్బిఐ బ్యాంక్ వరకు కొనసాగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు తిరుమలా దేవి,డాక్టరు సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో

ఈ కేవైసీ చేయించుకోండి

ప్రజాశక్తి - దుగ్గిరాల : పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులందరూ ఈనెల 20వ తేదీ శనివారం లోపు ఈ కేవైసీ చేయించుకోవాలని స్థానిక ఎస్ టి ఓ సి హెచ్ మరియమ్మ తెలిపారు. ఈ కే వై సీ చేయించుకోవ డానికి అదే ఆఖరి తేదీ అన్నారు. దుగ్గిరాల కొల్లిపర మండలాల పరిధిలో ఇంకా 167 మంది ఈ కేవైసీ చేయించుకోవలసి ఉంద న్నారు. ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేసిన అనంతరం కార్యాలయనికి వచ్చి ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు.

20న గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి - తాడికొండ

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ఆర్. సి. ఇ బాలురు తాడికొండలో 2023-24 విద్యాసంవత్సరానికి 5,6,8 తరగతులకు ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు గుం టూరు కేంద్రంగా నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.బాలాశ్రీ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షకు సంబం ధించిన అభ్యర్థులు హాల్ టిక్కెట్లు https://aprs.apcfss.in అనే వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు.ఈ నెల 15 నుండి అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టిక్కెట్లు పోస్ట్ ద్వారా పంపబడవు అని తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్ లో తమకు కేటాయిం చిన పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని తెలిపారు

సినీ ఆర్టిస్ట్ సుగుణరాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన 'దాగుడు మూతలు' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శతా బ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్య క్రమంలో ప్రముఖ పౌరాణిక, నాటక, టివి, సినీ ఆర్టిస్ట్ గుత్తా గురిందపల్లి సుగుణరాజును పార్టీ నాయకులు వాసిరెడ్డి శివరాం ప్రసాద్, బి వెంకట రవీంద్రప్రసాద్, పి యోహాను, కే సురేష్ బాబు, ఎన్ కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు తది తరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందించి సత్క రించారు. థియేటర్ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లే శ్వరరావు, సోమ వరపు సాంబశివరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవ రావు, దేనిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య, పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఏ నాగ శివయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. మతి చెందిన శివయ్య కుటుంబానికి మంగళవారం జనసేన కార్యా లయంలో ఐదు లక్షల రూపాయలు చెక్కును జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగ పాటి వెంకట మారుతి రావు, వాసా శ్రీనివాసరావు, డి శివ నాగేంద్రం, నేరెళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగు నీటికి ఇబ్బంది లేకుండా ప్రజ లకు ఈ మార్గాన వెళ్లే ప్రయా ణికులకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఈ మనీ గ్రామ సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వల హరిణి అన్నారు. గ్రామంలో మంగళవారం ఆమె చేతుల మీదుగా చదివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఉప సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి సాయి చైతన్య గ్రామ కార్యదర్శి డి సతీష్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా వర్సిటీ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసి కళాశాల 13వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం విలియం కేరి హాజరై మాట్లాడారు. జీవితంలో న్యాయ బద్ధంగా పోరాడుతూ ముందుకు వెళ్లిన వారికి విజయం లభిస్తుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన తెనాలి శారదా సొసైటీ డైరెక్టర్ డి శారద మాట్లాడుతూ వ్యాధి రహిత సమాజాన్ని సేవా దృక్పథంతో నిర్మించాలని సూచించారు. ఫార్మసీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సమాజం కోసం పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విసి పి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ ఎ ప్రమీలా రాణి, రెక్టార్ పి వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి కరుణ పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ద్వారా ప్రజలకు సేవ

ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

సివిల్ సర్వీసెస్ ద్వారా ఎంపికైన అధికారులు ప్రజలకు సేవలు అందించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారని, దానికి అనుగుణంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారని టుబాకో బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్), కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ క్లాసుల్లో మంగళవారం అద్దంకి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐఆర్ఎస్ అధికారిగా ఎంపికైన అశ్విన్ మణిదీప్ పాల్గొన్నారు. విద్యార్థులుగా ఉన్న వారు ఇప్పటి నుండే లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని, సివిల్స్ పరీక్ష లక్ష్యం కలిగిన వారు రెగ్యులర్‌గా కరంట్ ఎఫైర్స్ అధ్యయనం చేయాలని, ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఆప్షనల్స్ సబ్జెక్టుపై ఇప్పటి నుండే చదవాలని చెప్పారు. కార్యక్రమంలో సాయి, బాలు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు దంపతుల్ని సత్కరిస్తున్న శిష్యులు

ఆదర్శ గురువు పాతూరి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఇన్నర్ రింగురోడ్డు ఫేజ్ 2లోని శ్రీ కన్వెన్షన్‌లో మంగళవారం ఆదర్శ గురువుకు ఆత్మీయ సన్మానం పేరుతో ఆయన జెకెసి కాలేజి రిటైర్డ్ ప్రొఫెసర్ పాతూరి కోటేశ్వరరావును ఆయన శిష్యబృందం ఘనంగా సత్కరించారు. ఇంతమంది శిష్యుల అభిమానాన్ని పొందటం తనకు గర్వకారణంగా ఉందన్నారు. గురుశిష్యుల అనుబంధానికి ఈ కార్యక్రమం తార్కాణంగా ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఒక మంచి సాంప్రదాయానికి నాంది పలికిందని అన్నారు. ఎంతో మంది విద్యార్థులను నాయకులుగా తీర్చిదిద్దిన గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన దార్శనికుడు పాతూరి అని కొనియాడారు. బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తదితర ప్రముఖులు పాల్గొని పాతూరి దంపతుల్ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పాతూరి జీవిత విశేషాలు తెలిపే సావనీర్‌ను, గురువందనం సిడిని గురువందన మహోత్సవం కమిటీ చైర్మన్, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, లావు రత్తయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెకెసి కాలేజి అధ్యాపకులు మద్దినేని సుధాకర్, ఎవికె సుజాత, ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ సి.శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. శావల్యాపురం మండలం వయ్యకల్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి మంగళవారం ఉదయం ఆకస్మికంగా పర్యటించి ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం అమలును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కార్యక్రమం కింద సేవలు పొందుతున్న పేషంట్లతో చర్చించి అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఓఏపి మొబైల్ హెల్త్ యాప్‌ను పరిశీలించారు. అదే విధంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను అందుబాటులో ఉన్న మందులను నిశితంగా పరిశీలించి సంబంధిత డాక్టర్ల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 104 డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 104 వాహన డ్రైవర్లకు సచివాలయ సిబ్బందికి, సంబంధిత మెడికల్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమ సేవలు లక్ష్యానికి అనుగుణంగా అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారిని శోభరాణి, ఎఫ్‌డిపి నోడల్ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

మండలంలోని వయ్యకల్లు నుంచి వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. అదేవిధంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సుమారు పది లక్షల రూపాయలతో వయకల్లు వద్ద నిర్మితమవుతున్న కల్వర్టు పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి వయకల్లు వద్ద జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా చేపట్టిన తాగునీటి పనులను పరిశీలించారు.

14 మంది తిరుమల విద్యార్థులకు సొనాటాలో కొలువులు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రముఖ సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు 14 మంది ఉద్యోగాలు సాధించారని జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని తిరమల ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మంగళవారం తెలిపారు. సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీన నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తమ కళాశాల విద్యార్థులు 131 మంది పాల్గొన్నారని తెలిపారు. వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభను చాటి 14మంది ఉద్యోగాలు సాధించారని కంపెనీ ప్రతినిధులు ప్రకటించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన ఇసిఇ, సిఎస్ఇ, ఐటి, ట్రిపుల్ఇ విద్యార్థులు రూ.4లక్షల వార్షిక వేతనం పొందుతారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యలో తిరుమల కళాశాలది కొత్త పోకడ అని, ఇంజనీరింగ్ విద్యలోనే ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపై బోధన నేపథ్యంలో తమ విద్యార్థులు బహుళ జాతి కంపెనీలలో ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రావెల నారాయణ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు లాభాపేక్షకు ప్రాధాన్యత ఇవ్వకుండా తక్కువ ఫీజులతో ఇంజనీరింగ్ విద్యను బోధిస్తూ ఎంతో పేద విద్యార్థులను బహుళజాతి కంపెనీలలో కొలువులు సాధించేందుకు బాటలు వేసిందన్నారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్ అధికారి ఎం సాంబశివరావును ఉపాధ్యాయులను ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మరియు సెక్రటరీ కరస్పాండెంట్ లతో పాటు కళాశాల చైర్మన్ వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం ప్రత్యేకంగా అభినందించారు.

వక్ఫ్ భూముల వేలం వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పలు గ్రామాల్లోని వక్ఫ్ బోర్డుకు చెందిన వ్యవసాయ భూములకు నేడు నిర్వహించతలపెట్టిన వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు వక్ఫ్‌బోర్డు సిఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చిన్నతురకపాలెం, అమీనాబాద్, అరేపల్లి గ్రామాల్లోని వక్ఫబోర్డు వ్యవసాయ భూములకు వేలం పాట వాయిదా వేశామని, తర్వాత తేదీని ప్రకటిస్తామన్నారు.

చట్టసభల్లో మా బాధలు వినిపించండి

ఎమ్మెల్యే సుచరితకు ఏపీజేఏసీ అమరావతి నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వాన్ని ప్రజల గుమ్మానికి తీసుకెళ్లే ఉద్యోగులు.. వారి సమస్యలు పరిష్కారంకాక తీవ్ర వేదన పడుతున్నారని ఏపీజేఏసీ అమరావతి నాయకులు తెలిపారు. ఏపీజేఏసీ అమరావతి మూడో విడత ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల వేదన చెప్పుకుందాం కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి నాయకులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వాన్ని దగ్గర చేసేందుకు వారధులైన ఉద్యోగులు వారి కుటుంబాల్లో కష్టాలను తీర్చులేకపోతున్నారని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా అన్ని విభాగాలలో అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు, జీతాలు అందించాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయించాలని విన్నవించారు. ప్రతి రోజూ నల్లబ్యాడ్జిలతో ఉద్యోగాలకు వస్తుంటే.. ప్రజలు తెల్లముఖం వేసుకుని తమ వైపు జాలిగా చూస్తున్నారని, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారంటే ప్రభుత్వమూ సమస్యలు ఎదుర్కొంటున్నట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా సెక్రటరీ కిరణ్ కుమార్, ఈదులమూడి మధుబాబు, దత్తు, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుచరితకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు